

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

### 3

**ఉదయం** డోర్ బెల్ మోగడంతో గడ్డం గీసుకుంటున్న త్రివిక్రం వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా కార్పెంటర్ నిలబడి ఉన్నాడు.

"రమ్మన్నారు కదా సారు" చెప్పాడు అతను.

"అవును. రా."

త్రివిక్రం అతన్ని తన తండ్రి గదిలోకి తీసుకెళ్ళి ఆ గది తలుపు లోపల ఉన్న టవర్ బోల్ట్‌లని చూపించి చెప్పాడు.

"వాటిని తీసేయాలి."

"ఇంకా?"

"ఈ ఇంట్లోని అన్ని గదుల్లోని తలుపుల లోపల ఉన్న టవర్ బోల్టులన్నింటిని తీసేయాలి."

తన తండ్రి గదిలోని టవర్ బోల్ట్ పెట్టుకుని దాన్ని ఎలా తీయాలో మర్చిపోతే కష్టం అన్న ఆలోచన అతనికి కలిగింది. ఓ అల్జిమీర్స్ వ్యాధిగ్రస్థుడి విషయంలో అలా జరిగిందన్న సంగతి త్రివిక్రంకి గుర్తుంది. ఇంతకాలం తల్లి ఉండటంతో ఆ అవసరం రాలేదు. అంతా ఆమే చూసుకుంటుందని అనుకున్నాడు. ముందు రోజే హాస్పిటల్‌లో పనిచేసే కార్పెంటర్‌ని తనింటికి రమ్మని చెప్పాడు త్రివిక్రం. ఆ ప్రకారం అతను టవర్ బోల్ట్‌లన్నీ ఆ అపార్ట్‌మెంట్‌లోని తలుపుల నించి విప్పుతీసాక ఏ గదిలోంచి వాటిని తీసాడో వివరాలతో ప్లాస్టిక్ కవర్లలో త్రివిక్రం వాటిని భద్రపరిచాడు. అందువల్ల రేపు మళ్ళీ వాటిని తిరిగి బిగించాల్సిన అవసరం వచ్చినప్పుడు ఏ గదిలో దేన్ని బిగించాలో గందరగోళం లేకుండా స్పష్టంగా తెలుస్తుంది.

మనుషులు, బ్రహ్మచర్యం శాశ్వతం కాదని త్రివిక్రంకి తెలుసు.

త్రివిక్రం మర్నాడు ఉదయం తన తండ్రి బ్లడ్ సేంపుల్‌ని తీసుకున్నాడు. హాస్పిటల్‌కి వెళ్ళాక లాబ్‌లోని టెక్నీషియన్‌కి దాన్ని ఇచ్చి చెప్పాడు.

"నా బ్లడ్ స్పెసిమన్ తీసుకోండి. ఈ రెండు స్పెసిమన్స్‌కి డి.ఎన్.ఏ టెస్ట్ చేసి వీళ్ళిద్దరికి రక్తసంబంధం ఉండే అవకాశం ఉందేమో పరీక్ష చేసి చెప్తారా?"

"అలాగే. రెండు రోజుల్లో రిపోర్ట్ ఇస్తాను." చెప్పాడు లాబ్ టెక్నీషియన్.

హాస్పిటల్‌కి వెళ్ళాక ముందుగా రౌండ్స్‌కి వెళ్ళి క్రితం వారంలో తను ఆపరేషన్ చేసిన రోగులని పరామర్శించాడు. తల్లి మరణించాక తను ఎదుర్కొనే మొదటి సమస్య తన తండ్రిని ఒంటరిగా వదలకూడదన్నది. డాక్టర్ విరజతో ఆ సమస్య గురించి చర్చించాడు.

"ఉదయం నించి మీరు తిరిగి ఇంటికి వెళ్ళేదాకా ఇంట్లో ఉండేందుకు ఓ రిటైర్డ్ మేల్ నర్స్‌ని కుదుర్చుకోండి. వారికి మెడికల్ ఎమర్జన్సీని హేండిల్ చేయడం కొట్టిన పిండి. మన నర్సింగ్ స్టాఫ్‌ని అడిగితే రిటైరై ఖాళీగా ఉన్న అలాంటి వారి వివరాలు తెలియచ్చు." ఆమె సలహా ఇచ్చింది.

తన ఇంట్లో పని చేసేందుకు రిటైర్డ్ మేల్ నర్స్‌లు ఎవరైనా కావాలని హాస్పిటల్ లోని కొందరితో చెప్పాడు.

ఆల్వాల్‌లో జరిగిన ఓ బస్ - లారి యాక్సిడెంట్‌లో పన్నెండుమందిని గాంధీ హాస్పిటల్‌కి తీసుకువచ్చి అడ్మిట్ చేసారు. ఆపరేషన్స్ చేసే టీమ్‌లో ఉన్న త్రివిక్రం ఒక్కోదాని తర్వాత పావుగంట వ్యవధి తీసుకుని మొత్తం నాలుగు ఆపరేషన్స్ చేసాడు. దాంతో డస్సిపోయిన త్రివిక్రం ఇంటికి వెళ్ళిపోయాడు. సుబ్బరామయ్య మళ్ళీ మర్నాడు వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఎలాంటి మనిషి ఎలా అయిపోయాడు? సింహంలా వుండే మీ నాన్న పిల్లిలా అయిపోయాడు" ఆయన బాధగా చెప్పాడు.

జనని మరణించి నెల దాటుతోంది. తల్లి మరణంతో మూడ్ లేక ఈ-మెయిల్స్‌ని చూడటం ఆపేసిన త్రివిక్రం ఆ రాత్రి మెయిల్స్‌ని చూసాడు. ఓ మెడికల్ సావనీర్‌కి తన వ్యాసం కోరుతూ గతంలో డల్లాస్ నుంచి డాక్టర్ వేణుగోపాలరెడ్డి నించి వచ్చిన మెయిల్ కనపడింది. సెప్టెంబర్ 21 'వరల్డ్ అల్జీమర్స్ డే' అని, ఆ రోజు కల్లా ఆ సావనీర్‌ని వెలువరించాలని, చెప్పిన టైంకి అందలేదని వెంటనే దాన్ని పంపి సహకరించమని ఆ మెయిల్. అతను, త్రివిక్రం యం.బి.బిఎస్‌లో క్లాస్ మేట్స్, మంచి ఫ్రెండ్స్.

త్రివిక్రం వెంటనే నోట్ పేడ్‌ని తెరిచి ఇంగ్లీష్‌లో తను దాని గురించి అంతకుముందే రాసుకున్న నోట్స్‌ని ఓసారి చదువుకున్నాడు. తర్వాత వర్డ్ డాక్యుమెంట్‌ని తెరచి అందులో ముందు వేణుగోపాలరెడ్డికి ఆలస్యానికి కారణం వివరిస్తూ ఓ ఉత్తరం టైప్ చేసాడు. దాని కింద వ్యాసాన్ని టైప్ చేయసాగాడు. ఆ వ్యాసాన్ని ఇలా మొదలెట్టాడు.

"డాక్టర్! నాకో సమస్య ఉంది. నేనేం మాట్లాడానో నాకు గుర్తుండటం లేదు."

"ఈ సమస్యని మీరు మొదటగా ఎప్పుడు గుర్తించారు?"

"ఏ సమస్య?" ప్రశ్నించాడా రోగి.

ఈ జోక్‌లోని అల్జీమర్స్ వ్యాధిగ్రస్థుడి మాటలకి మనకి నవ్వు రావచ్చు. కానీ అది నవ్వించే వ్యాధి కాదని, ఏడిపించే వ్యాధి అని డాక్టర్‌గా నాకు బాగా తెలుసు. కానీ ఓ కొడుకుగా నాకు దాని గురించి ఇంకా బాగా తెలుసు. నా తండ్రి అల్జీమర్స్ రోగి. కాబట్టి వైద్యపుస్తకాల్లో కాక, నా అనుభవంలోంచి ఈ వ్యాసాన్ని రాస్తున్నాను' అని మొదలుపెట్టాడు. అతని చేతి వేళ్ళు కీ బోర్డ్ మీద పరిగెత్తసాగాయి, 'కొండ చిలువ మేకపిల్లని మింగినట్లుగా, మెల్లమెల్లగా మొదలయ్యే ఈ మతిమరుపు వ్యాధి మలి సంధ్యకి తొలి గుర్తు. నిదానంగా కానీ ఆ మతిమరుపు గురించి కుటుంబ సభ్యులకు స్పష్టంకాదు. కానీ అప్పటికే సమయం మించిపోతుంది. ఆ రోగి డైరీల్లోని ఒక్కో పేజీ క్రమంగా చెరిపివేయబడుతూంటుంది. అందులో నమోదైనదంతా రోజుకి కొంత చొప్పున అతని మెదడులోంచి మాయం అవుతూంటుంది. చివరికి పేజీలు లేని అట్టలా, జ్ఞాపకాల రహితంగా ఉట్టి మానవ శరీరం మిగులుతుంది. అది ఆ రోగి కన్నా, అతని చుట్టుపక్కల వారందరికీ శాపంగా పరిణమిస్తుంది. వేదాలని, పురాణాలని పుక్కిట పట్టిన అఖండ జ్ఞాపకశక్తిగల ఘనాపాటి కూడా, ఈ వ్యాధి సోకితే తనను తాను గుర్తించలేని అయోమయ స్థితిలోకి చేరుకుంటాడు. ఈ వ్యాధి ఫలితంగా ఒకోసారి అరవై ఏళ్ళ మనిషి పసిపిల్లతో సమానం అవుతాడు. ఆకలి వేస్తే అడగడు. మనమే కనిపెట్టి పెట్టాలి. ఓ నిమిషం నవ్వుతాడు. ఓ నిమిషం ఏడుస్తాడు.

కొందరిలో వ్యక్తిత్వ మార్పులు కూడా దారుణంగా వస్తాయని డాక్టర్‌గా గమనించాను. పరకాంతని కన్నెత్తి చూడని వాడు కూడా ఇప్పుడు మదన జ్వర పీడితుడు అవచ్చు. పనిమనిషి మీద చెయ్యి వేయచ్చు. తన కూతురులాంటిదని భావించే కోడలు ఇచ్చే కాఫీలో

విషం కలిపిందేమోనని సదా అనుమానించవచ్చు. అల్జీమర్స్ దాడి మొదలైతే నాడీకణాలు అచేతనమయి, న్యూరో ట్రాన్స్‌మీటర్లు తమ సమర్థతని కోల్పోతాయి. దాంతో ఆ రోగిలో శారీరకంగా, మానసికంగా పతనం ఆరంభమైనట్లే.

యాభై ఏళ్ళ అల్జీమర్స్ అనే జర్మన్ వైద్యుడు నూరేళ్ళ క్రితం తొలిసారిగా ఓ మహిళలో ఈ వ్యాధి లక్షణాలని గుర్తించి, ఈ వ్యాధి గురించి ప్రపంచానికి బహిర్గతం చేసాడు. దాంతో ఈ వ్యాధికి అతని పేరే పెట్టారు. క్రమేపీ ఈ రోగం గురించి వైద్య పుస్తకాల్లోకి ఎక్కింది. ఇది ఎందుకు వస్తుందన్న విషయంలో పరిశోధనలు జరుగుతున్నా ఇంతదాకా ఎవరికీ స్పష్టతలేదు.

తాళం చెవి ఎక్కడ పెట్టామన్నది మర్చిపోతే అది మతిమరుపు. కానీ అసలు తాళం చెవి అనేది ఒకటుందన్న సంగతే మరవడం అల్జీమర్స్. కొద్దిపాటి మతిమరపు వస్తే, అది వృద్ధాప్యపు సహజ లక్షణం అనుకుంటారు. కొందరిలో సమస్య అక్కడితో ఆగదు. మాట్లాడటానికి అకస్మాత్తుగా మాటలు అందవు. పదాల కొరతతో పాటు మాటల్లో, చూపుల్లో తడబాటు చోటు చేసుకుంటుంది. ఆత్మీయులకి అతనిలోని ఈ గందరగోళం తెలిసి పోతూంటుంది. కానీ అది ఓ వ్యాధని, డాక్టర్ దగ్గరకి వెళ్ళాలని తోచదు. రోజూ వచ్చే పోస్ట్‌మేన్ ఓ రోజు అతనికి కొత్తగా కనబడి 'ఎవరు నువ్వు?' అని అడిగినప్పుడు ఆత్మీయులు ఖంగు తింటారు. తేదీలు, వారాలు, నెలలు, ఫోన్ నెంబర్లు, పేర్లు మొదలైన వాటన్నిటిలో గందరగోళం చోటు చేసుకుంటుంది. ఇతరుల సాయం లేకుండా ఏ పనీ సాగదు. క్రమేపీ 'ఆ మనిషేనా ఈ మనిషి' అనిపించేంత వ్యక్తిత్వ తేడాలు కూడా చోటు చేసుకుంటాయి. శరీర అవసరాలకి కూడా స్పందించే గుణం తగ్గిపోయి, బాత్‌రూంకి ఎవరైనా తీసుకెళ్ళాల్సిందే వ్యాధి ముదిరితే తింటూ మింగడం, నడుస్తూ నడవడం మర్చిపోతారు.

ఆత్మీయులైన కుటుంబ సభ్యుల మధ్య జీవించే వారికంటే, ఒంటరి జీవుల్లోనే ఈ వ్యాధి అధికం. వ్యాయామం చేసే వారిలో ఈ వ్యాధి విస్తరణ, అది చేయని వారికన్నా తక్కువ. ఖాళీగా ఉన్నప్పుడూ పజిల్స్ నింపడం లాంటి పనులు చేస్తూండటం ద్వార మెదడులోని నాడులు ఒకదానితో మరొకటి అనుసంధానం చెందుతుంటాయి. పుస్తకపఠనం, రచనా వ్యాసంగం కూడా అల్జీమర్స్‌ని వేగవంతం కాకుండా నిరోధిస్తాయని ఇజ్రాయిల్‌లో జరిగిన అధ్యయనం వల్ల తెలుస్తోంది. మానసిక పరిశ్రమ ఈ వ్యాధికి శత్రువు. ధూమపానం, మద్యపానం చేసేవారికి అల్జీమర్స్ వచ్చే అవకాశాలు ఎక్కువ. మిగిలిన దేశాల కంటే ఇండియాలో ఇది తక్కువ కాబట్టే ఇండియన్స్‌కి ఈ వ్యాధి గురించి పెద్దగా తెలియదు. వారు వాడే పసుపు, కరివేపాకులు, ఇతర పోపు దినుసులు ఇందుకు కారణం కావచ్చు. వీటిని ఇతర దేశస్థులు ఆహారంలో పెద్దగా వాడరు. తోటపని, సంగీతం వినడం, ధ్యానం, ప్రార్థనలు అల్జీమర్స్ రోగులకి చక్కటి ఉపశమనాన్ని ఇస్తాయి.

గంటల తరబడి శూన్యంలోకి చూస్తూ ఊరికే కూర్చునే రోగులకి ఫ్యామిలీ ఫోటో ఆల్బంలు, వారి పాత డైరీలు పాత జ్ఞాపకాల్లోకి తీసుకెళ్ళే మందుల్లా పని చేస్తాయి. పెంపుడు జంతువుల సాంగత్యం కూడా వారికి మేలు చేస్తుంది.

'తన్మాత్ర' అనే మళయాళ సినిమాలో అల్జీమర్స్ రోగి ఓసారి పడక గదిలో తన జీవిత భాగస్వామిని దగ్గరకి తీసుకున్నప్పుడు గోడమీది బల్లి మీదకి అతని దృష్టి మళ్ళుతుంది. అంతే. దాన్ని చూస్తూ శృంగారం గురించి మర్చిపోతాడు. అతని భార్య పరిస్థితి అప్పుడు ఎలా ఉంటుంది? ఆ సినిమాలో అతన్ని కాపాడుకోడానికి కుటుంబ సభ్యులు పడే యాతన చూడవచ్చు.

'మైనే గాంధీకో నహీ మారా'లో అనుపమ్ ఖేర్, 'బ్లాక్'లో అమితాబ్ బచ్చన్‌లు అల్జీమర్స్ రోగుల పాత్రలని అద్భుతంగా పోషించారు.

యాభై ఏళ్ళు కాపురం చేసాక ఓ రోజు భర్తని భార్య 'నువ్వెవరు?' అంటే అతనిలో కలిగే ఆవేదనని కొలవలేం. అలాగే కోడల్ని కూతురిలా చూసే మామగారి చూపుల్లో తేడా వస్తే ఆమె ఆవేదననీ కొలవలేం. 'ఇలా ఎంతకాలం?' అన్న ప్రశ్నకి విషాదకరమైన జవాబే సిద్ధంగా ఉంది - అతను జీవించి ఉండేదాకా. తమని తాము గుర్తుపట్టలేరు. అద్దంలో చూసినప్పుడల్లా 'ఇతనెవరు?' అనే ప్రశ్న వాళ్ళ మదిలో మెదులుతూంటుంది. ఆఫీస్‌కి దారి మర్చిపోతారు. రోజూ వండే అన్నం ఎలా వండాలో మర్చిపోతారు. తమ బంధుమిత్రులు తమకి ఏమవుతారో గుర్తుండదు. సిగరెట్ ఆర్పి ఫ్రిజ్‌లో పెడతారు. గడియారాన్ని మైక్రోవేవ్ ఓవెన్‌లో ఉంచుతారు.

అల్జీమర్స్ రోగులు ప్రారంభ దశలోనే వీలునామాలు, నామినేషన్లలాంటి కీలక విషయాల్లో తొందరపడాలి. బేంక్ ఖాతాలు, బీమా కాగితాలు, షేర్ సర్టిఫికెట్స్ లాంటివి నమ్మకమైన వారికి అప్పచెప్పాలి. జ్ఞాపకాలని నెమరువేసుకోవాలి. చిన్నప్పటి నించీ జరిగినవన్నీ గుర్తు తెచ్చుకుంటూండాలి. ఓ గదిలోని వస్తువులని శ్రద్ధగా చూసి, కళ్ళు మూసుకుని వాటన్నిటినీ గుర్తు తెచ్చుకోవడంలాంటి మానసిక వ్యాయామం చేస్తుండాలి. తోడు లేకుండా గుంపుల్లోకి వెళ్ళకపోవడం, ఒకసారి ఒక పనే చేయడంలాంటివి అల్జీమర్స్ రోగులకి ప్రారంభ దశలో ఆ రోగం ప్రబలకుండా సహాయం చేస్తాయి. చేయాల్సిన పనులన్నిటినీ కాగితం మీద రాసి పెట్టుకోవడం అందరికీ మంచిది. అల్జీమర్స్ వ్యాధిగ్రస్థులకి మరీ మంచిది.

స్వానుభవంతో చెప్తున్నాను. అల్జీమర్స్ రోగులకి సూచనలని దశలవారీగా ఇవ్వాలి. 'ముందు బటన్స్ విప్పండి. ఇప్పుడు చొక్కా విప్పండి. గోడ దగ్గరకి వెళ్ళండి. దాన్నిప్పుడు కొక్కేనికి తగిలించండి. బల్ల దగ్గరకి రండి. దానిమీది ఇస్త్రీ చొక్కా తీసుకోండి. దాన్ని వేసుకోండి. ఇప్పుడు బటన్స్ పెట్టుకోండి.' ఇలా. అల్జీమర్స్ రోగి స్పందించడంలోని వేగం తగ్గుతుంది కాబట్టి ఇలా దశల వారీగా సూచనలు ఇవ్వాలి. రోగి ముందు ప్రేమని తప్ప విసుగుని ప్రదర్శించరాదు. వారి మనసు బాధపడుతుంది. ఆదేశాలు ఇస్తున్నట్లు కాకుండా సూచనలు ఇస్తున్నట్లుగా చెప్పండి.

'అప్పుడే మర్చిపోయావా? ఎన్నిసార్లు చెప్పాలి?' లాంటి పదాలని వాళ్ళ ముందు వాడకూడదు ఆ వ్యక్తి కోపంగా అరిచినా, దాడి చేసినా అది ఆ వ్యాధి లక్షణం కాబట్టి అది అతని తప్పు కాదని అర్థం చేసుకోవాలి. వాళ్ళు ఒంటరిగా గడప దాటకుండా కాపాడుకోవాలి. అల్జీమర్స్ రోగి అని తెలిసి ఒంటరిగా బయటకి వెళ్ళిన అతని కోసం వెదకాల్సి వస్తే, అది అతని కుటుంబ సభ్యుల తప్పిదం తప్ప ఆ రోగిది కాదు. దురదృష్టవశాత్తూ ఇది ఎవరికైనా అనుభవం మీద కానీ తెలిసి రాని పాఠం.

అన్నీ తానైన మనిషి అపరిచితుడై పోవడమే ఈ రోగ ప్రధాన లక్షణం. 'ఈ ప్రపంచమే పట్టనట్లు బ్రతికే ఆ మనిషే మన ప్రపంచంలా బ్రతకాలి.'

ఆ మొత్తం వ్యాసాన్ని త్రివిక్రం అందులో ఇన్‌వాల్వ్ అయి టైప్ చేయడంతో అతనిలో కొద్దిగా ఆవేశం చోటు చేసుకుంది. అది పూర్తయ్యే సరికి అతని కళ్ళ వెంట ధారాపాతంగా నీరు కారుతోంది. పూర్తయ్యాక ఆ ఉద్వేగంలోంచి అతను బయటకి రావడానికి చాలాసేపు పట్టింది.

మరోసారి తను రాసింది మొత్తం చదువుకుని అక్కడక్కడ పదాలని మార్చాడు. స్పెల్ చెక్ ద్వారా రెండు స్పెల్లింగ్ మిస్టేక్స్‌ని కరెక్ట్ చేసాడు.

దాన్ని ఈ - మెయిల్‌కి అటాచ్‌మెంట్‌గ పంపబోయే ముందు ఓ ఆలోచన స్ఫురించింది. వెంటనే ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి అమెరికన్ కవయిత్రి రూమి టాన్ అల్జీమర్స్ మీద రాసిన ఓ కవిత్వాన్ని వెదికి పట్టుకుని దాన్ని కాపీ చేసి వ్యాసం మొదట్లో పేస్ట్ చేసాడు.

అమ్మా!

నువ్వు నవ్వడం తొలిసారిగా చూసాను.

కలతలు లేకుండా నిద్రించడం చూసాను.

పిల్లల గురించి బెంగపడకుండా తినడం చూసాను.

రేపటి గురించి ఆలోచన లేకుండా జీవించడం చూసాను.

నాకు బాల్యాన్ని ఇచ్చిన నీ బాల్యాన్ని చూసాను.

అల్జీమర్స్‌కి నా కృతజ్ఞతలు.

త్రివిక్రం దాన్ని డల్లాస్‌లోని వేణుగోపాలరెడ్డికి ఈ - మెయిల్ చేసాడు.

కంప్యూటర్ ముందునుంచి లేచి వెళ్ళి ఓరగా తెరచి ఉన్న తండ్రి గది తలుపు సందులోంచి లోపలకి చూసాడు. ఆయన ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ఆయనలో ఇతరుల మీద దాడి చేసే స్వభావం, కాముకత్వాలు రానందుకు దేవుడికి ఎన్నోసార్లు త్రివిక్రం తన కృతజ్ఞతలని తెలియ చేసుకున్నాడు. దగ్గరకి వెళ్ళి చెదిరిన ఆయన దుప్పటిని సరిగ్గా కప్పి కింద పరుపు మీద పడుకున్నాడు.

ఉదయం సుబ్బరామయ్య వచ్చేలోగా త్రివిక్రం సెల్‌కి రెండు ఫోన్ కాల్స్ వచ్చాయి. ఒకటి వరంగల్ బాబాయ్ నించి.

"ఏరా? ఎలా ఉన్నావు?" అడిగాడాయన.

"బాగానే ఉన్నాను బాబాయ్."

"నాన్నెలా ఉన్నాడు?"

"బాగానే ఉన్నారు."

"పిల్లలకి పరీక్షలు అయ్యాక నేను, మీ పిన్ని ఇద్దరం వచ్చి కొద్దిరోజులు మీ నాన్న దగ్గర ఉందామని అనుకుంటున్నాం."

"చాలా సంతోషం. తప్పక రండి."

"ఉండు. మీ పిన్ని మాట్లాడుతుందిట."

కొద్ది క్షణాల తర్వాత పిన్ని జానకి కంఠం వినిపించిందతనికి.

"ఏరా విక్కీ? అంతా కులాసానేనా?"

"ఆఁ"

"ఏమిటి విశేషాలు?"

"ఇంట్లోని తలుపుల లోపల ఉన్న టవర్ బోల్ట్‌లన్నీ తీయించేసాను."

"ఎందుకని? ఓ మీ నాన్న లోపల గడియ పెట్టుకుని తీయక పోవచ్చనా? మంచి ఆలోచన చేసావే?" మెచ్చుకుంటూ చెప్పింది. కాసేపు మాట్లాడి పెట్టేసింది.

కొద్ది నిమిషాల తర్వాత అతనికి ఇంకో ఫోన్ కాల్ వచ్చింది. అది తన బాబాయ్ ఆదిశంకర్ నించి అని గ్రహించి చెప్పాడు.

"చెప్పండి బాబాయ్. ఎలా ఉన్నారు?"

"బానే ఉన్నాను. మీ నాన్నెలా ఉన్నారు?"

"బాగానే ఉన్నారు."

"నేను ఇక్కడున్నా నా మనసంతా అక్కడే ఉంది. ఒక్కడివే ఏం అవస్థలు పడుతున్నావో అని. నువ్వు హాస్పిటల్‌కి నాన్నని ఒంటరిగా వదిలి వెళ్తున్నావా?"

"లేదు. సుబ్బరామయ్యగారు వచ్చి ఉంటున్నారు. మనిషిని చూస్తున్నాను. ఇంట్లో ఉండే 'లివ్ ఇన్ హెల్ప్' ఎవరైనా దొరికితే బావుండును."

"త్వరగా చూడు మా ఇంట్లోంచి ఎవరైనా వచ్చి నీ దగ్గర ఉండాలంటే అందరికీ ఏవో వ్యాపకాలు."

"కరెక్టే"

మరి కొద్దిసేపు మాట్లాడి ఆయన ఫోన్ పెట్టేసాడు. ఐదు నిముషాల తర్వాత సుబ్బరామయ్య వచ్చాడు. ఆయన రాగానే త్రివిక్రం హాస్పిటల్‌కి బయలుదేరాడు.

ముందుగా రౌండ్స్‌కి వెళ్ళి రోగులని పరామర్శించాడు. తన ఇంట్లో పనిచేసేందుకు రిటైర్డ్ నర్స్‌లు కావాలని చెప్పడంతో సాయంత్రం మూడున్నరకి ముగ్గురు వచ్చారు. ఒకరు ఇంట్లో ఉండటానికైతే పన్నెండు వేలు, రోజూ వచ్చి వెళ్ళడానికి పదివేలు అడిగారు. ఇంకొకరు ఎనిమిదివేలు అడిగారు. వారిలో ఒకరు సుందరేశ్వర్. ఆయనతో మాట్లాడాక ముగ్గురిలోకి ఆయనే సంస్కారవంతుడిగా అనిపించి ఆయన్ని ఎంపిక చేసాడు త్రివిక్రం. నెలకి తొమ్మిదివేల రూపాయల జీతం. జీతం విషయంలో ఆయన బేరం ఆడలేదు. ఇంటి ఎడ్రస్ తీసుకుని మర్నాడు ఉదయం వస్తానని చెప్పాడు.

టేబుల్ మీద గుర్తుకు రాసుకున్న కాగితం 'డి.ఎన్.ఏ రిజల్ట్స్' త్రివిక్రంకి కనపడింది.

'ఇదేమిటి? ఇంత ముఖ్యమైంది మర్చిపోయాను? నాక్కూడా కొంపతీసి అల్జీమర్స్ మొదలైందా?' అనుకున్నాడు. వెంటనే లేబ్‌కి వెళ్ళాడు. డి.ఎన్.ఏ టెస్ట్‌కి కట్టిన రసీదు లేబ్ టెక్నీషియన్ చేతికి ఇచ్చి అడిగాడు.

"రిపోర్టు రెడీనా?"

"యస్ డాక్టర్."

అతను క్లిప్‌కి ఉన్న కవర్లలోంచి ఓ కవర్‌ని తీసిచ్చాడు. అందులోని కంప్యూటర్ ప్రింటవుట్‌ని తీసి రిపోర్ట్‌ని చదివాడు త్రివిక్రం.

వెంటనే అతని మొహం మాడిపోయింది.

తన తండ్రి రక్తం ఆధారంగా జరిపిన డి.ఎన్.ఏ టెస్ట్‌లో ఆ రిపోర్ట్ ప్రకారం ఆయన కొడుకు కాడు. ఆయన తన తండ్రి కాదు.

అకస్మాత్తుగా తను ఓ కుటుంబంలోంచి కిందకి జార్చివేయబడ్డ అనాథ అని గ్రహించగానే అతనికి కొద్ది నిముషాలసేపు బుర్ర స్థంభించిపోయింది. వెంటనే ఒక్క ఆలోచన కూడా రాలేదు. తర్వాత ఆలోచనల వేగం అనూహ్యంగా పుంజుకుంది.

అందరిలా తను తన తల్లిదండ్రులు ఇద్దరికీ పుట్టినవాడిననే అనుకున్నాడు. మార్చురీ టేబుల్ మీదకి చేరిన తల్లి దేహంలో గర్భాశయం పుట్టుకతోనే లేకపోవడం వల్ల తను తల్లికి పుట్టలేదు. డి.ఎన్.ఏ పరీక్ష రిజల్ట్ ప్రకారం తను తన తండ్రికి కూడా పుట్టలేదు.

తను అనాథా? ఐతే అసలు తను ఈ కుటుంబంలోకి ఎలా వచ్చి చేరాడు? అందుకు గల కారణాలు ఏమిటి? అసలు తన తల్లి ఎవరు? తండ్రి ఎవరు? బతికే ఉన్నారా? ఉంటే వారు ఇప్పుడు ఎక్కడున్నారు? అసలు వారికి వివాహం అయిందా? తను వాళ్ళని కనుక్కోగలడా? ఎలా? వారు తనని కలుసుకోడానికి ఎందుకు ప్రయత్నించలేదు? ఈ విషయంలో ఎవరు తనకి సహాయం చేయగలరు? చేయగలిగే తల్లి లేదు. ఉన్న తండ్రి వల్ల కాదది.

త్రివిక్రంలో రకరకాల ఆలోచనలు చెలరేగసాగాయి. అతను కారుని యాంత్రికంగా డ్రైవ్ చేస్తూ ఇంటికి చేరుకున్నాడు. బూట్లయినా విప్పకుండా సరాసరి తండ్రి గదిలోకి వెళ్ళాడు. అతన్ని చూసి టి.విని ఆర్పేసి సుబ్బరామయ్య లేచి సెలవు తీసుకున్నాడు. మర్నాడు ఉదయం వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

త్రివిక్రం తన తండ్రి దగ్గరకి వెళ్ళి ఒంగి ఆయన కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

"నాన్నగారూ! చెప్పండి. నా తల్లిదండ్రులు ఎవరు?"

ఆయన బ్లాంక్‌గా చూస్తుండిపోయాడు తప్ప జవాబు చెప్పలేదు.

"మిమ్మల్నే నాన్నగారూ చెప్పండి. ఎవరు నా తల్లి? నా తండ్రి ఎవరు?" ఆయన భుజాలని పట్టుకుని కుదుపుతూ అడిగాడు.

ఆయన నోట్లోంచి మాటలు పెగల్లేదు. తన తండ్రి నించి ఎలాంటి సమాచారం రాదని తెలిసాక నిస్పృహగా ఆయన్ని వదిలి త్రివిక్రం బయటకి నడిచాడు. అతనికి మనసంతా అశాంతిగా ఉంది.

మళ్ళీ తండ్రి గదిలోకి వెళ్ళి అలమర తెరచి ఆయన డైరీలన్నింటినీ తీసాడు. వాటిలో 1981 డైరీని వెదికి తీసాడు. దాన్ని తన గదిలోకి తీసుకెళ్ళి తెరచి తన పుట్టినరోజు అయిన సెప్టెంబర్ ఇరవై ఒకటో తారీకు పేజీని తెరిచాడు. ఆత్రంగా అందులో ఏం రాసి ఉందా అని చూసాడు. ఒకే ఒక్క పదం ఉంది.

'మా జీవితాల్లో ఇవాల్టినించీ మబ్బులు వీడి ఉషోదయం.'

గబగబా తర్వాతి పేజీలని తిప్పుతూ చదివాడు. ఎక్కడా త్రివిక్రం పుట్టుపూర్వోత్తరాలకి సంబంధించిన విశేషాలు లేవు. అతని కోసం కొన్న పాలడబ్బా, ఫారెక్స్‌లాంటి ఖర్చుల వివరాలు మాత్రం రాసి ఉన్నాయి. ఇంకో మనిషి పేరుకానీ, ఇతర వివరాలు కానీ ఎక్కడా లేవు. ఎందుకని ఆ విషయాలు తన తండ్రి డైరీలో రాయలేదు? బహుశా తను ఓ రోజు వాటిని చదవచ్చనే రాయలేదా? త్రివిక్రం ఆ డైరీని చివరి పేజీదాకా చదివాడు. తన పుట్టినరోజుకి మూడు వారాల తర్వాత మాత్రం 'ఇవాళ ఢిల్లీ చేరుకున్నాం' అన్న వాక్యం ఉంది తప్ప 'ఎక్కడనించి?' అన్న విషయం రాసిలేదు. తన పుట్టుక విషయం తను రాసుకునే డైరీనించి రహస్యంగా ఉంచాలన్న తండ్రి తాపత్రయం త్రివిక్రంకి గోచరించింది. నవంబర్ పన్నెండున మాత్రం ఇంగ్లీష్‌లో రాసిన ఓ కొటేషన్ ఉంది.

He who raises a child is to be called its father, not the man who only gave it birth.

అది ఎందుకు రాసాడో త్రివిక్రంకి స్పష్టంగా బోధపడింది. తన రిఫరెన్స్ కూడా డైరీలో ఎక్కడా త్రివిక్రంకి తర్వాతి పేజీల్లో కనపడలేదు. ఆ డైరీని పెట్టేసి, తర్వాత సంవత్సరం డైరీని అందుకుని మొత్తం గబగబా తిరగేసాడు. అందులో కూడా తన జన్మ రహస్యం తెలిసే విషయాలు ఏమీ అతనికి కనపడలేదు.

చిన్నగా నిట్టూర్చాడు. ఏ కారణం వల్లో తన తండ్రి ఆ విషయాలని రహస్యంగా ఉంచాలని కోరుకున్నాడని త్రివిక్రంకి అర్థమైంది. లేకపోతే కొన్న కూరలు, వాటి బరువు, ధరలాంటి అత్యల్ప విషయాలు డైరీలో రాసుకున్న తన తండ్రి, తను వాళ్ళ జీవితంలోకి వచ్చిన పెద్ద విషయం గురించి రాయకుండా ఎలా ఉండగలడు?

అప్పటికే రాత్రి పదకొండు అవడంతో త్రివిక్రం ఆ డైరీని చివరిదాకా చదవకుండానే ఇక నిద్రని ఆపుకోలేక నేలమీది పరుపు మీద పడుకున్నాడు. గత రాత్రి సరిగ్గా నిద్రపట్టని అతనికి ఐదు నిముషాల్లోనే నిద్రపట్టేసింది.

మర్నాడు ఉదయం నిద్రలేచాక త్రివిక్రం ముందు తండ్రి గదిలోకి వెళ్ళి ఆయన తన కాలకృత్యాలని తీర్చుకోడానికి సహాయం చేసాడు. ఆయనకి డ్రస్ చేసాక కాలింగ్ బెల్ మోగింది.

చేతిలో సూట్ కేస్‌తో తలుపు అవతల సుందరేశ్వర్ నిలబడి ఉన్నాడు. అతను ముప్ఫై రెండేళ్ళు గాంధీ హాస్పిటల్‌లో మేల్ నర్స్‌గా పని చేసి ఇటీవలే రిటైరయ్యాడు. ఇంకా పని చేసే దారుఢ్యం ఉంది. పిల్లలు ముగ్గురికీ వివాహాలయ్యాయి. భార్యపోయి ఏడేళ్ళు కావస్తోంది. నాలుగేళ్ళ క్రితం ఆఖరి కూతురి వివాహమై ఆమె భర్త దగ్గరకి వెళ్ళాక ఆయన ఒంటరిగానే జీవిస్తున్నాడు. ఆ రోజు త్రివిక్రం ఇంటికి షిఫ్ట్ అయ్యాక, ఇక మల్కాజ్‌గిరిలోని తన స్వంత ఇంటిని త్వరలో అద్దెకి ఇవ్వాలని కూడా అతను నిర్ణయించుకున్నాడు.

సుందరేశ్వర్‌కి తన తండ్రిని, ఇంటిని పరిచయం చేసాడు త్రివిక్రం.

"ఎవరితను?" అడిగాడు రాంప్రసాద్ ఆయన్ని చూసి.

"ఇక నించి మీకు కంపెనీగా ఉండే ఫ్రెండ్" జవాబు చెప్పాడు త్రివిక్రం.

"అలాగా.. సంతోషం. జనని ఏదీ?"

కొద్దిసేపాగి ఆయన సుందరేశ్వర్ వైపు తిరిగి అడిగాడు.

"మీరెవరు?"

తమకి వంట చేసి పెట్టేవారు దొరకడంతో త్రివిక్రంకి రిలీఫ్‌గా ఉంది సుబ్బరామయ్య కూడా వచ్చాడు. అతనికి సుందరేశ్వర్‌ని పరిచయం చేసి చెప్పాడు.

"ఇంక రేపటినించి మీరు రానక్కర్లేదు."

"మంచి పని చేసావు" సుబ్బరామయ్య మెచ్చుకున్నాడు.

అతను హాస్పిటల్‌కి బయలుదేరాడు. డాక్టర్ విరజ ఎదురై అతన్ని పలకరించింది.

"ఎవ్విరి థింగ్ ఆల్ రైట్?"

"నాట్ మచ్... మా అమ్మ గురించి ఇంకా తెలీలేదు."

"ప్రయత్నం చేయండి."

"ఎవరు చెప్తారో, ఎక్కడి నుంచి మొదలెట్టాలో తెలీడం లేదు."

"బద్ధకంగా పడుకునే సింహం, వేటాడే చిరుత పులులని చూసి అవి హైపర్ ఏక్టివ్ అనుకుంటుందిట. బహుశా దానికి వేట ఎక్కడ నించీ మొదలుపెట్టాలో తెలీదనుకుంటా. అప్పుడే మీ అమ్మ పోయి రెండు నెలలు దాటుతోంది. మీ రిలెటివ్స్‌తో చర్చించండి. వాళ్ళకి తెలిసి ఉండచ్చు కుటుంబ మిత్రులకి కూడా తెలిసే అవకాశం ఉంటుంది."

"కానీ వాళ్ళని ఎలా అడగను? ఇది రహస్యం కదా?"

"మీ అమ్మ పోయాక ఇక ఆ రహస్యం బట్టబయలైనా ఎవరికీ ఇబ్బందిలేదుగా? ఐనా ఇది మీకు తెలిసిందని తెలిస్తే కానీ ఆ రహస్యం తెలిసిన వారు సహాయం చేయడానికి ముందుకు రారు."

"థాంక్స్ ఫర్ ది అడ్వైజ్."

దగ్గరే కాబట్టి త్రివిక్రం తల్లి బతికి ఉన్నప్పటిలా లంచ్ అవర్‌లో ఇంటికి వెళ్ళాడు. సుందరేశ్వర్ తన తండ్రితో ఎలా ఉన్నాడో చూడటానికి, అతని వంట రుచి చూడటానికి. ఆ రాయలసీమ వంట రుచిగా ఉంది. అతను శుభ్రతని పాటించే మనిషి అని కూడా వంటగదిని చూసి గ్రహించాడు.

సుబ్బరామయ్యని తన గదిలోకి పిలిచి అడిగాడు.

"ఎలా ఉన్నారు సుందరేశ్వర్ గారు?"

"మంచాయన. ఓపిక, శ్రద్ధ ఎక్కువ. జీతం ఎంతిస్తున్నావు?" ప్రశ్నించాడాయన.

"తొమ్మిదివేలు."

"ఎక్కువ అడిగినా ఆయన్ని వదులుకోవద్దు" సలహా ఇచ్చాడు.

కొద్దిగా సందేహించి అడిగాడు త్రివిక్రం.

"మా అమ్మా నాన్న మీకు చాలా కాలంగా తెలుసు కదా?"

"అవును. ముప్పై ఏళ్ళుగా తెలుసు. ఏం?"

"మా అమ్మ నాకోసారి ఓ మాట చెప్పింది. దాన్ని గురించి పూర్తి వివరాలు నాకు ఎన్నడూ చెప్పలేదు. మీకేమైనా చెప్పిందేమోనని."

"ఏమిటా మాట?"

"నేను మా అమ్మకి పుట్టలేదుట."

"ఛ? నిజంగా అలా చెప్పిందా?" నివ్వెరపోయాడాయన.

"అవును."

"నాతో ఎన్నడూ అలా చెప్పలేదే? మా ఆవిడతో కూడా చెప్పి ఉండదు. చెపితే అది నాకు ఆ విషయం చెప్పేసేది."

"ఐతే మీకా విషయాలు తెలీదన్నమాట?"

"ఉహూ."

"మా బంధువులంతా మీకు తెలుసు. మీరంతా కలిసి నాయుడు కాంపౌండ్‌లో ఉండేప్పుడు మా అమ్మానాన్నలని చూడటానికి మా బంధువులు కాక వేరే ఎవరైనా మా ఇంటికి వచ్చిన స్నేహితులు మీకు గుర్తున్నారా?"

"దేనికి? వాళ్ళని అడుగుదామనా?"

"అవును. లేదా వాళ్ళల్లో ఎవరైనా నా తల్లితండ్రులు అయి ఉండచ్చు."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments